ప్రజాశక్తి

సోమవారం 5 జూన్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

విశాఖ వాసులు క్షేమమేనా?

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఒడిశా రాష్ట్రం బాలాసోర్ వద్ద జరిగిన రైళ్ల ప్రమాద దుర్ఘటనలో విశాఖపట్నానికి చెందిన ప్రయాణికులు అందరూ క్షేమమేనని ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెబుతున్నప్పటికీ విశాఖ వాసులకు నమ్మకం కలగడంలేదు. అధికారులు వెల్లడిస్తున్న గణాంకాలు ప్రకారం ఇప్పటికీ 28 మంది ఆచూకీ లభించలేదు. 180 మృతదేహాల గుర్తింపు ఇంకా పూర్తి కాలేదు. హౌరా, ఆ తర్వాత స్టేషన్లలో విశాఖపట్నం లేదా ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు జనరల్ టికెట్ తీసుకున్న ప్రయాణికుల సమాచారం ఇప్పటికీ రైల్వే, ప్రభుత్వ యంత్రాంగం వద్ద లేవు. మృతదేహాల గుర్తింపు పూర్తికాని వారిలోకానీ, ఆచూకీ లభించని 28 మందిలో కానీ విశాఖ లేదా ఆంధ్ర రాష్ట్ర వాసులు ఉండే అవకాశం ఉండవచ్చేమోనని ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆ రైల్లో ప్రయాణిస్తున్న వారి వివరాల కోసం హెల్ప్ లైన్ సెంటర్లను ఎవరూ సంప్రదించలేదని ఒడిశాలో మంత్రి అమర్‌నాథ్ బృందం, విశాఖలో మంత్రి

మిగతా 2లో..

ఇప్పటి వరకు ఒక్కరే మృతి : అమర్‌నాథ్

ఎంవిపి కాలనీ : ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో ఇప్పటి వరకు తేలిన లెక్క ప్రకారం ఆంధ్రప్రదేశ్ నుంచి శ్రీకాకుళం జిల్లాకు చెందిన చోడిపల్లి గురుమూర్తి ఒక్కరే మృతి చెందారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులను భువనేశ్వర్, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలోని వివిధ ఆసుపత్రులకు తరలించిన అనంతరం మంత్రి అమర్‌నాథ్ ముగ్గురు ఐఎఎస్, ముగ్గురు ఐపిఎస్ అధికారులతో కూడిన ఉన్నత స్థాయి సమావేశం ఆదివారం ఉదయం బాలాసోర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, ఏలూరులో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌లలో తమ వారు కనిపించడం లేదని ఇప్పటివరకు ఎవరూ రాలేదని, తమ వారి ఆచూకీ కోసం 8333905022 అన్న వాట్సాప్ నెంబర్‌కు ఫొటోలు పంపిస్తే అధికారులు వారి వివరాలు సేకరిస్తారని తెలిపారు. రాష్ట్రానికి చెందిన 16 అంబులెన్స్‌లు, 10 మహాప్రస్థానం వాహనాలను భువనేశ్వర్‌లో అందుబాటులో ఉంచామని, మరో ఐదు అంబులెన్సులను బాలాసోర్ వద్ద సిద్ధంగా ఉంచామని చెప్పారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొంతమందిని భువనేశ్వర్‌లోని అపోలో హాస్పిటల్‌కు, ఇద్దరిని విశాఖలోని సెవెన్ హిల్స్ హాస్పిటల్‌కు, ఒకరిని విశాఖ ఆరిలోవలోని అపోలో హాస్పటల్‌కు తరలించామని వివరించారు.

క్షతగాత్రులకు అమర్‌నాథ్ పరామర్శ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఒడిశాలోని రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి భువనేశ్వర్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాలి మండలం ఎం.కొత్తూరుకు చెందిన కె.రూపను ఎపి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదివారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆమె ఎడమ చేతికి తీవ్ర గాయం అయిందని, చికిత్స అవసరమని మంత్రి అమర్‌నాథ్‌కు డాక్టర్లు వివరించారు. రూప ఆరోగ్య పరిస్థితిని గమనించిన మంత్రి అమర్‌నాథ్ వెంటనే ఆమెను విశాఖలోని అపోలో ఆసుపత్రికి తరలించాలని అధికారులను ఆదేశించారు.



గాయపడిన రూపను భువనేశ్వర్ ఆసుపత్రిలో పరామర్శిస్తున్న అమర్‌నాథ్

నేటి నుంచి కౌలు రైతు రక్షణయాత్ర జాతా

మునగపాకలో ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

కౌలు రైతుల చట్టాన్ని సవరించి, భూ యజమానుల ఆమోదంతో నిమిత్తం లేకుండా గ్రామ సభద్వారా కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు మంజూరుచేయాలన్న పలు డిమాండ్లతో సాగుతున్న ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు రక్షణ జీపు జాతా సోమవారం ఉదయం 8 గంటలకు మునగపాక నుంచి ప్రారంభంకానుంది. ఈ జీపు జాతాను కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు ప్రారంభించనున్నారు. తొలిరోజు మునగపాక, అచ్యుతాపురం, యలమంచిలి, కశింకోట మండలాల్లోని 12 గ్రామాల్లో, మంగళవారం అనకాపల్లి మండలం తుమ్మపాలలో యాత్ర ప్రారంభమై ఇంకుపాలెం, తగరంపూడి, సీతానగరం మీదుగా చోడవరం మండలం పిఎస్ పేటలో ప్రవేశించి చోడవరం, బుచ్చెయ్యపేట మండలాల్లోని కెజిపురం, లక్కవరం తదితర గ్రామాల్లో పూర్తిచేసుకొని తూర్పుగోదావరి జిల్లాలో ప్రవేశించనుంది.

2011 కౌలుదారీ చట్టాన్ని జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం సవరించి, 2019లో తీసుకొచ్చిన పంట సాగుదారుల హక్కు చట్టంతో కౌలు రైతులకు కొత్త సమస్యలు ముందుకొచ్చాయి. అధికారంలోకి వస్తే కౌలు రైతులను సంరక్షిస్తామని, రైతు ఆదాయాలను రెట్టింపు చేస్తామని ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక కౌలురైతుకు ఉన్న కొద్దిపాటి భరోసాను లేకుండా చేశారు. భూ

మిగతా 2లో..



పర్సా సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎవి.నాగేశ్వరరావు, సిహెచ్.నర్సింగరావు తదితరులు

కార్మికోద్యమానికి దిక్సూచి పర్సా సత్యనారాయణ

వార్త మెయిన్‌లో..

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

వార్త 3లో..

20ఎ సిటీ బస్సును పునరుద్ధరించాలి : వార్వా, నివాస్

వార్త 2లో..

మొదటి పేజీ తరువాయి..

విశాఖ వాసులు క్షేమమేనా?

బొత్స ఆధ్వర్యాన అధికార యంత్రాంగం ప్రకటిస్తున్నా సమన్వయ లోపం కనిపిస్తోంది. శనివారం సాయంత్రం ప్రత్యేక రైలు ద్వారా 10 మంది విశాఖ చేరుకోగా ఆదివారం మరొక ఏడుగురు విశాఖ చేరుకున్నారు. ఆచూకీ లేని 28 మంది, జనరల్ టికెట్ తీసుకున్న ప్రయాణికుల వివరాలు, మృతదేహాల గుర్తింపు పూర్తయిన తర్వాత మాత్రమే విశాఖ వాసులు లేరని నిర్ధారించగలం. మృతుల వివరాలపై వాల్తేరు డివిజన్ రైల్వే అధికారులు ఇప్పటికీ స్పష్టంగా ఎటువంటి వివరాలు ప్రకటించక పోవటం గమనర్హం.

నేటి నుంచి కౌలు రైతు రక్షణ యాత్ర జాతా

యజమానుల ఆమోదం పొందాలన్న షరతు విధించడంతో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పొందలేని పరిస్థితి ఏర్పడింది. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు భూ యజమానులు ఆమోదం ఇవ్వడంలేదు. గ్రామ సభలు నిర్వహించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరుచేయడంలేదు. రాయితీపై విత్తనాలు, ఎరువులు, యంత్రపరికరాలు వంటివేవీ కౌలురైతుకు లభించడంలేదు. పంట రుణం, పంట నష్టపరిహారం, ఇన్‌బీఅట్ సబ్సిడీ, రైతు భరోసా వంటివి అందడంలేదు.

పెట్టుబడులకు అప్పుల కోసం ప్రయివేటు వ్యాపారులను కౌలురైతుల ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో 70వేల మందికిపైగా కౌలురైతులున్నప్పటికీ నాలుగువేల మందికి కూడా గుర్తింపుకార్డులు లభించలేదు. చెరకు పంట గిట్టుబాటుకాకపోవడం, ప్రభుత్వం సహకార చక్కెర ఫ్యాక్టరీలను నిర్వీర్యం చేయడంతో లక్ష ఎకరాల్లో సాగైన చెరకు 30వేల ఎకరాలకు పడిపోయింది. చెరకు సాగులో అత్యధికమంది కౌలు రైతులున్నారు. అనకాపల్లి, మునగపాక, కశింకోట, అచ్యుతాపురం, చీడికాడ, మాడుగుల, దేవరాపల్లి, చోడవరం, కె.కోటపాడు, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట, యలమంచిలి, రాంబిల్లి మండలాల్లో ఎక్కువమంది కౌలురైతులున్నారు. సాగుచేసి కష్టనష్టాలను భరిస్తున్న కౌలురైతుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం, ప్రోత్సాహం లభించకపోవడంతో అప్పులపాలవుతున్నారు. కొంతమంది వ్యవసాయాన్ని వదులుకుంటున్నారు. కౌలు రైతుల సమస్యలపై కౌలు రైతుల సంఘం రాష్ట్ర వ్యాపితంగా కౌలు రైతు రక్షణయాత్ర పేరిట జీపు జాతా చేపట్టింది. అందులో భాగంగా జిల్లాలో సోమ, మంగళవారాల్లో జీపు జాతా పలు గ్రామాలు వెళ్లనుంది. కౌలు రైతుల సమస్యలను తెలుసుకోనుంది. ఈ యాత్ర వివిధ జిల్లాల మీదుగా సాగి 12న విజయవాడ చేరుకొని కౌలు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనుంది.

కౌలు రైతుకు నష్టంకల్గించే చట్టాన్ని రద్దు చేయాలి



వైసిపి ప్రభుత్వంలో కౌలు రైతులకు భరోసా లేదు. కనీస రక్షణలేదు. పాడి ఆధారంగా బతుకుతున్న కౌలు రైతు పశు గ్రాసం కోసం వ్యవసాయం చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. కేరళ తరహాలో పంటలకు మద్దతు ధరలు, రుణ విముక్తి చట్టం చేయాలి. పంటరుణాలు, బీమా నష్ట పరిహారం ఇవ్వాలి. భూ యజమాని ఆమోదంతో నిమిత్తంలేకుండా 2011 చట్టాన్ని పునరుద్ధరించి కౌలురైతుకు నష్టంలేకుండా అమలుచేయాలి. రైతు భరోసా వర్తింపజేయాలి. కౌలు రైతుల పేరుతో ఈ క్రాప్ నమోదుచేయాలి.

- ఎ.బాలకృష్ణ,
ఎపి కౌలురైతుల సంఘం కార్యదర్శి, అనకాపల్లి జిల్లా

20ఎ సిటీ బస్సును పునరుద్ధరించాలి

వార్వా, నివాస్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : 20ఎ సిటీ బస్సును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ వార్వా, నివాస్, హెచ్‌బి కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం హెచ్‌బి.కాలనీ లాస్ట్ బస్సు స్టాప్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వార్వా, నివాస్ ప్రతినిధులు మాట్లాడుతూ, కరోనా సమయంలో ఈ బస్సును రద్దు చేశారని తెలిపారు. రెసిడెంట్స్ ఎక్కువగా ఉండే ఈ ప్రాంత ప్రజలకు ఈ సిటీ బస్సు చాలా ఉపయోగకరంగా ఉండేదని, దీన్ని రద్దు చెయ్యడం వలన జగదాంబ పూర్ణా మార్కెట్, వన్ టౌన్ ప్రాంతాలకు వెళ్లేందుకు సిటీ బస్సు సౌకర్యం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. బస్సు లేకపోవడంతో జగదాంబ తదితర ప్రాంతాలకు వెళ్లేందకు రూ.40 ఖర్చు చేయాల్సి వస్తోందని తెలిపారు. గతంలో ఆర్‌టిసి ఆర్‌ఎంను కలిసి వినతిపత్రం సమర్పించామని, బస్సులు ఖాళీగా నడుస్తున్నాయని వింత వాదనలు చేస్తున్నారని చెప్పారు. కనీసం రద్దీగా ఉండే సమయంలోనైనా, రూటు దూరం పెంచయినా 20ఎ బస్సును నడపాలని కోరారు. సామాజిక సదుపాయాలను లాభార్జనతో ముడి పెట్టడం సరికాదని ఆర్‌టిసి అధికారులు గుర్తించాలని కోరారు. రద్దు చేసిన రూట్లలో తిరిగి బస్సులను నడపడానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షులు నరవ ప్రకాశరావు, డాక్టర్ కె.రమాప్రభ, వార్వా ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్, మద్దిలపాలెం కార్యదర్శి కెఎం.కుమారమంగళం, హెచ్‌బి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బుగత సత్యనారాయణ, కె.సత్యవతి, కె.దేముడు, జి.మధు, కూర్మేష్, జివి.రమణ, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన చేస్తున్న వార్వా, నివాస్, హెచ్‌బి.కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

న్యాయవ్యవస్థపై దాడులా? : వైసిపి లీగల్ సెల్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : చంద్రబాబుకు అనుకూలంగా తీర్పులొస్తే ఒకలా, వ్యతిరేకంగా వస్తే చంద్రబాబు అండ్ కోతో పాటు ఎల్లో మీడియా రెచ్చిపోతూ న్యాయ వ్యవస్థపై పరోక్ష దాడులకు దిగుతోందని రాష్ట్ర వైసిపి లీగల్ సెల్ అధ్యక్షులు, హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎం.మనోహరరెడ్డి ఆరోపించారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో అధికారం చేపట్టిన జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే, చంద్రబాబు అడుగడుగునా అడ్డు తగులుతూ అనేక రిట్ పిటిషన్లు వేశారన్నారు. ఏ ప్రభుత్వమైనా పేదవాడి కోసం ఆలోచించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అమలు సక్రమంగా సాగిపోతుండడంతో ఏమీ చేయలేక, నేరుగా ముఖ్యమంత్రి పైనే వ్యక్తిగత దూషణలకు టిడిపి నాయకులు దిగుతున్నారని ఆరోపించారు. చంద్రబాబుకు వత్తాసు పలుకుతున్న ఎల్లో మీడియా న్యాయవ్యవస్థపై పరోక్ష దాడులకు దిగడం సిగ్గుచేటు అన్నారు. జడ్జిపై వ్యక్తిగత దూషణలు చేసిన రెండు టీవీ చానల్స్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవినాష్‌రెడ్డి ముందస్తు బెయిల్ విషయంలో టీవీల్లో అదే పనిగా జడ్జిలపైన వ్యక్తిగత దూషణలకు దిగుతూ న్యాయవ్యవస్థకు భంగం కలిగేలా చేశారని, వారిపై చర్య తీసుకోవాలని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి విన్నవించినట్లు తెలిపారు.

జాతీయ ర్యాంకింగ్ టోర్నమెంట్ టెక్నికల్ అధికారిగా శర్మ



ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : హైదరాబాద్‌లో ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న జాతీయ ర్యాంకింగ్ టోర్నమెంట్‌కు టెక్నికల్ అధికారిగా బ్లూ బ్యాడ్జ్ అంపైర్ డాక్టర్ డివిఎస్‌వై.శర్మ నామినేట్ అయ్యారు. డాక్టర్ శర్మ విశాఖపట్నంలో ఎల్ఐసిలో పని చేస్తున్నారు. ఆయన ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా డివిఎస్‌వై.శర్మను ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదా ప్రసాద్ దాస్, మేనేజర్ పర్సనల్ భగవాన్ ప్రసాద్, ఎంప్లాయీస్ అసోసియేషన్ సెక్రటరీ జి.వరప్రసాద్, ప్రెసిడెంట్ కామేశ్వరి అభినందించారు.

ఘనంగా దేవల మహర్షి జయంతి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : దేవాంగుల ఆరాధ్యుడు, వంశ మూల పురుషుడు దేవల మహర్షి జయంతిని దేవాంగ మాసపత్రిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. దేవల మహర్షి చిత్రపటానికి దేవాంగపత్రిక సంపాదకులు ఉప్పుగంటి సదాశివరావు, పబ్లిషర్ ఉప్పుగంటి కిరణ్‌కుమార్ ఫల, పుష్పాల సమర్పించి యావత్ దేవాంగ కుటుంబాలలో దివ్య వెలుగులు ప్రసరించాలని మహర్షిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో చేనేత సమాచార మాస పత్రిక సంపాదకులు ఎవివిఎస్.మూర్తి (బాదంగీర్ సాయి), ప్రియాంక, ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్నేషనల్ ఆర్గానిక్ మహోత్సవ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రైతు సాధికార సంస్థ ఆధ్వర్యాన గాదిరాజు పాలస్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఆర్గానిక్ మహోత్సవ్-2023 ముగిసింది. ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఉత్పత్తులతో పాటు ప్రకృతి వ్యవసాయ ద్రావణాలు, ఘన ద్రవ జీవామృతాలు సందర్శకులను ఆకర్షించాయి. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడానికి పలు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఇలాంటి మరెన్నో ఆర్గానిక్ ఎగ్జిబిషన్లు నిర్వహిస్తామని ఆర్‌వైఎస్ఎస్ యాజమాన్యం తెలిపింది.

ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోటీలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యాన ప్రభుత్వ క్వీన్ మేరి బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలలో టైలరింగ్, డ్రాయింగ్‌లో టిటిసి శిక్షణ పొందుతున్న విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జిల్లా సమన్వయ కర్త పి.రాజారావు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణను ప్రజలందరూ తమవంతు బాధ్యతగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవడం, పరిసర ప్రాంతాలలో మొక్కలు పెంచడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరుణాకర్, రవి, రామలక్ష్మి విజిపి శ్రీనివాస్ పాల్గొన్నారు.



బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్‌పిబి అభిమాన సంఘం నాయకులు

ఘనంగా బాలసుబ్రహ్మణ్యం జయంతి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : గాన గంధర్వులు, కీర్తిశేషులు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం జయంతిని ఎస్‌పిబి అభిమాన సంఘం ఆధ్వర్యాన విశాఖలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమాన సంఘం సభ్యులు శర్మ ఆప్టికల్స్ ప్రతినిధి అద్దంకి వాసు, కబడ్డీ శ్రీను, వెంకీ పాగోటి, వనమా శ్రీను, సాయి, శంకర్, మురళి తదితరులు మాట్లాడుతూ, విశాఖ సముద్ర తీరాన ఎస్‌పి.బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని కోరారు.

కరాటే, కిక్ బాక్సింగ్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : కరాటే, కిక్ బాక్సింగ్‌లో జివిఎంసి సమ్మర్ కోచింగ్ ఉచిత శిక్షణ ఆంధ్ర మెడికల్ కాలేజీ ఆవరణలో ఆదివారం ప్రారంభమైంది. ప్రత్యేకంగా పాఠశాల, కళాశాలల విద్యార్థుల కోసం ఉచిత శిక్షణను నిర్వహిస్తున్నట్టు కిక్ బాక్సింగ్ కోచ్ వడ్డాది సురేష్, కరాటే కోచ్ లక్ష్మీపతి తెలిపారు. కరాటే గ్రాండ్ మాస్టర్ కె.సుమన్, కిక్ బాక్సింగ్‌లో సీనియర్ కోచ్ ఆనందబాలు ఈ శిక్షణను పర్యవేక్షిస్తున్నట్టు వారు తెలిపారు. త్వరలో జగదాంబ జంక్షన్ సమీపంలోని అంబికాబాగ్‌లో సాయంత్రం వేళల్లో ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్టు తెలిపారు.

నేడు డయల్ యువర్ ఆర్‌డిఒ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు ప్రతి సోమవారమూ డయల్ యువర్ ఆర్‌డిఒ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ తెలిపారు. ప్రజల సౌకర్యార్థం సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

హోండా షైన్ 100 సిసి బైక్ ఆవిష్కరణ



బైక్ ఆవిష్కరిస్తున్న సంస్థ ఎండీ వాసురెడ్డి వంశీ, తదితరులు

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ సమీపంలోని సీత ప్రైమ్ హోండా షోరూమ్‌లో హోండా షైన్ 100 సిసి కొత్తబైక్‌ను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వాసురెడ్డి వంశీ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా విశాఖ జిల్లాలో హోండాషైన్ 100సిసి బైక్‌ను మధురవాడ సీత ప్రైమ్ బ్రాంచ్‌లో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అందుబాటు ధరలో, అతి ఎక్కువ మైలేజీని ఇచ్చే ఈ బైక్, సామాన్య మధ్య తరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సీత ప్రైమ్ హోండా షోరూం ద్వారా ఎప్పటికప్పుడు నూతన బైక్‌లను అందుబాటులోకి తెస్తూ మధురవాడ ప్రాంత ప్రజల ఆదరాభిమానాలను చూరగొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ మోహన్, సర్వీస్ మేనేజర్ అభిషేక్, సేల్స్ మేనేజర్ పి సంజీవ్‌కుమార్, బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

తొలి మేనిఫెస్టోతో పేదలకు మేలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : రాజమహేంద్రవరం మహానాడులో టిడిపి విడుదల చేసిన తొలి మేనిఫెస్టోతో అన్ని తరగతుల ప్రజలకు మేలు జరుగుతుందని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, మహానాడులో టిడిపి ప్రకటించిన మినీ మేనిఫెస్టోలో రైతులకు అన్నదాత పథకం, మహిళలకు మహాశక్తి, నిరుద్యోగులకు ఉద్యోగాలు, పేదలను సంపన్నులను చేయడం, బిసిలకు రక్షణ తదితర పథకాలను ప్రకటించారన్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా మేనిఫెస్టోను ప్రకటించిన చంద్రబాబుకు ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు

ముగిసిన మాధవధార చలివేంద్రం

ప్రజాశక్తి- మాధవధార : మాధవధార గ్రామానికి. మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చలివేంద్రాన్ని ఆదివారంతో ముగించారు. మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో. పేడాడ సన్యాసయ్య ,అమ్మాయమ్మ. దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు పేడాడ వెంకటరావు, పేడాడ నర్సింగరావు ఆర్థిక సాయంతో దీన్ని నిర్వహించగా, మాధవధార గ్రామప్రజలు, శ్రేయోభిలాషులు విరాళాలు ఇచ్చి సహకరించారు.

ఈ సందర్భంగా మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నంబాల ఈశ్వరరావు కార్యదర్శి సనపల శ్రీకాంత్ మాట్లాడుతూ. వేసవికాలం ఆరంభంలో ఏటా చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నామన్నారు. చలివేంద్రం నిర్వహణతోపాటు అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యాక్రమాలకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సంరధ్భంగా. పేడాడ వెంకటరావు, పేడాడ నర్సింగరావులను మాధవధార కళింగ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు.


చిన్నారుల ఆరోగ్యానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి -గాజువాక : చిన్నారుల ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయని సింహాచలం ట్రస్ట్‌బోర్డు సభ్యులు దొడ్డి రమణ అన్నారు. ఆదివారం 76వ వార్డు బర్మాకాలనీలో అంజనీపుత్ర బాక్సింగ్ క్లబ్, అండి బోయిన సన్నీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడాశిక్షణ శిబిరంలో మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పాఠశాల, కాలేజీ విద్యార్థులకు ఆసక్తి ఉన్న క్రీడాంశంలో నిపుణులతో శిక్షణనివ్వడంతోపాటు, వారికి జివిఎంసి ద్వారా పౌష్టికాహారాన్ని కూడా అందజేస్తున్నామన్నారు. క్రీడల్లో నైపుణ్యత ఆధారంగా విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్, ప్రాధాన్యత ఉంటుందని, ఇలాంటి శిక్షణ శిబిరాలను సద్వినియోం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దుంగ దేవన్ రాజు, కడవల ఈశ్వరరావు, బోయాడపు శ్రీను, జగరపు శ్రీను, సోమశేఖర్, కోచ్‌లు కె. గణేష్, డి.దీపక్, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

స్పష్టత కనిపిస్తున్నా సందిగ్ధం!

గాజువాక అసెంబ్లీ స్థానంలో పోటీ అభ్యర్థులపై అపుడే చర్చోపచర్చలు

ప్రజాశక్తి -గాజువాక : సార్వత్రిక ఎన్నికలకు మరో ఏడాది సమయమున్నా, గాజువాక నియోజవర్గంలో రాజకీయ సమీకరణలపై ప్రజల్లో చర్చ జరుగుతోంది. తెలుగుదేశం పార్టీ పరిశీలిస్తే గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతానికి పార్టీలో ఆ స్థాయికి తగ్గ వ్యక్తి పల్లా శ్రీనివాసరావు తప్ప మరొకరు లేరని పార్టీలోనూ, బయట అనుకుంటున్నారు. అయితే నూతన రాజకీయ పరిణామాల నేపథ్యంలో పల్లా శ్రీనివాసరావును విశాఖ ఎంపీ స్థానానికి పంపించి, గతంలో టిడిపి తరఫున ఎంపీగా బరిలో నిలిచిన శ్రీభరత్‌ను భీమిలి అసెంబ్లీ స్థానంలో పోటీలో దింపాలని పార్టీ అధిష్టానం భావిస్తున్నట్లు చర్చజరుగుతోంది. ఇదే సమయంలో పొత్తులు కుదిరితే, గాజువాక అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు కేటాయిస్తే, గతంలో పోటీచేసిన ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పోటీలో ఉంటారని మరో వాదన ఉంది. అలా కాకుండా టిడిపియే పోటీలో ఉంటే, పల్లాను ఎంపీ బరిలో దింపితే, గాజువాక ఎమ్మెల్యే స్థానానికి 87వ వార్డు టిడిపి కార్పొరేటర్ బొండా జగన్ పోటీలో ఉండే అవకాశాలున్నాయన్న చర్చ ఉంది. జగన్ ఆర్థికంగా బలమైన వ్యక్తి కాకపోయినా, కాపు సామాజిక వర్గం చెందిన వ్యక్తి కాబట్టి, ఆ కోటాలో ఎమ్మెల్యే సీటు ఇస్తే గెలుస్తాడని మహానాడులో చర్చకు వచ్చినట్లు గాజువాకలో టిడిపిలోని ఒక వర్గం ప్రచారం చేస్తోంది. పల్లా శ్రీను సీటు ఇస్తే కాకి గోవిందరెడ్డి, హర్షవర్ధన్, పప్పు రాజారావు వంటి నేతలు ఎంతవరకు సహకరిస్తారనే అంశంపై పార్టీలో అంతర్గతంగా చర్చిస్తున్నట్లు సమాచారం. అయితే ఇదే వ్యక్తులకు బొండా జగన్‌కు సీటిస్తే మాత్రం సహకరిస్తారనే వాదన ఉంది.



మరోవైపు అధికార వైసిపికి సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిగానీ,ఆయన కుమారుడు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి పోటీ బరిలో నిలవడం దాదాపు ఖాయమనే అంటున్నారు. ఇటీవల గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు వచ్చేలా పనిచేయడంతో దాదాపు పోటీలో నిలవడం ఖాయమేనని అంటున్నా, రె ండో ఆప్షన్‌గా తిప్పల కుటుంబంలో ఒకరికి ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించి, గాజువాక అసెంబ్లీ నియోజకవర్గానికి వైసిపి తరపున కాపు, లేదా యాదవ సామాజిక వర్గాలకు టిక్కెట్ కేటాయిస్తే ఎలా ఉంటుందనే సమీకరణ లు పార్టీలో అంతర్గతంగా జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికలకు మరో ఏడాది ఉన్నప్పటికీ, అభ్యర్థులెవరనే విషయమై ఇప్పటికే ఊహాగానాలు, చర్చలు జరుగుతుందగా,, కొందరు ఆశావహులు తమకు సీటు కేటాయిస్తే పోటీకి అవసరమైన డబ్బు సమకూర్చుకునే పనిలో ఇప్పటికే తలమునకలైపోయారనే ప్రచారమూ ఉంది. కొంతమంది సొంత స్థలాలను అమ్మకాలకు పెట్టి డబ్బులు సమకూర్చుకునే పనిలో ఉండగా, మరి కొంతమంది ప్రభుత్వ భూమి సెటిల్మెంట్లు, దందాలతో బిజీగా ఉన్నారని అంటున్నారు.

దుర్మాలమ్మ పండగ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైవి.సుబ్బారెడ్డి, ముత్తంశెట్టి

ప్రజాశక్తి -మధురవాడ : చంద్రంపాలెం జాతరగట్టుపై వెలసిన గ్రామదేవత దుర్గాలమ్మ పండుగ పోస్టర్‌ను టిటిడి చైర్మన్, వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం ఆవిష్కరించారు. గతనెల 5న పండుగ చాటింపుతో ప్రారంభమైన వేడుకల్లో భాగంగా గ్రామదేవతలు ఎర్నమ్మ, దండుమారమ్మ అమ్మవార్ల ఉత్సవాలు నిర్వహించనున్నారు.

దుర్గాలమ్మ పండుగలో భాగంగా 12న సోమవారం రాత్రికి తొలేళ్ల ఉత్సవం, 13 మంగళవారం ప్రధాన పండుగ, చద్దన్నం, జోగి దండడం, నూకాలమ్మ పసుపు కుంకుమ సమర్పణ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిళ్లా కష్ణమూర్తి పాత్రుడు, దుర్గాలమ్మ ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, పిళ్లా శ్రీనివాసరావు, పీస రామారావు, జగుపిల్లి నాని, బోగవిల్లి నాని, పిళ్లా సత్యనారయణ, ఆలయ కమిటీ కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, సభ్యులు పిళ్లా వెంకటరమణ, గూడేల రాజు, పొట్నూరి హరికృష్ణ, పిళ్లా రమణ, పిళ్లా సన్యాసిరావు పాల్గొన్నారు.

20న మోదకొండమ్మ పండుగ

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఈనెల 18,19, 20 తేదీల్లో నిర్వహించనున్న గోపాలపట్నంలో మోదకొండమ్మ జాతర వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈనెల 20న అమ్మవారి ప్రధాన పండుగ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు విల్లురి ప్రకాష్, కోనేటి నూకరాజు, బెహరా విజయ్ చైతన్య, నారిపిన్ని సత్తిరాజు, కెవి బాలసుబ్రమణ్యం, ఇతర కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

వీధి బాలలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానికులు పల్లా వెంకటరావు జ్ఞాపకార్థం అతని భార్య సుశీలా కనకరత్నం ఆదివారం పలువురు వీధి బాలలకు, అనాథ పిల్లలకు దుస్తులు, బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. అనాథ బాలలను ఏదో ఒక సందర్భాన్ని కల్పించుకుని సేవ చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు.కార్యక్రమంలో స్థానికులు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు

ఒడిశా రైలు ప్రమాదం బాధాకరం

ప్రజాశక్తి- మాధవధార : భారతీయ రైల్వే చరిత్రలో అత్యంత విషాదకరమైన ఘోర రైలు ప్రమాదం ఒడిశా బాలాసోర్ జిల్లాలో జరగడం అత్యంత బాధాకరమని ఎపి రాష్ట్ర కాంగ్రెస్ ఒబిసి విభాగం చైర్మన్ మూల వెంకటరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకేచోట మూడు రైళ్లు ఢీకొన్న ఘటనలో దాదాపు 300మంది మృతి చెందడం, వెయ్యి మందికిపైగా ప్రయాణికులకు గాయాలు కావడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటనకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి, మృతుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి రైల్వే ఉద్యోగం, క్షతగాత్రులు కోలుకునే వరకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రధాని మోడీతోపాటు రైల్వేమంత్రి, బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, ఒడిశా సిఎం నవీన్‌పట్నాయక్ స్పందించి, బాధితులను పరామర్శించడం, సహాయక చర్యలను పర్యవేక్షించడం అభినందనీయమన్నారు. ఆంధ్రా, తమిళనాడు సిఎంలు కూడా స్పందించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

-కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న కుమార్తె





మృతులు పెద్దయ్య, పావని

ప్రజాశక్తి - ఆరిలోవ : రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందిన విషాద ఘటన ఆదివారం సాగర్‌నగర్ బైపార్క్, ర్యాడిసన్ పార్కు సమీపంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలివి. విజయనగరం జిల్లా భోగాపురం ప్రాంతానికి చెందిన మైలపల్లి పెద్దయ్య(30) ఆయన భార్య పావని(25), మూడేళ్ల కుమార్తె యక్షిత నగరంలోని జాలారిపేటలో నివాసం ఉంటున్నారు. పెద్దయ్య వృత్తిరీత్యా కూలి. సొంతూరిలో బంధువుల వివాహానికి శనివారం భార్య, కూతురితో వెళ్లిన పెద్దయ్య, తిరిగి ఆదివారం వేకువజామున అదే బైకుపై విశాఖకు వస్తుండగా, జాతీయ రహదారి ఎండాడ నుంచి రుషికొండ వెళ్లి, అక్కడ నుంచి బీచ్ రోడ్డులో జాలారిపేట వస్తుండగా బైపార్కు, ర్యాడిసన్ బ్లూహోటల్ వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో బైకు నడుపుతున్న పెద్దయ్య తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కొన ఊపిరితో ఉన్న భార్య పావని, కుమార్తె యక్షితలను స్థానికులు గీతం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పావని మృతి చెందింది. యక్షితను కెజిహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతోంది. భార్యాభర్తల మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు మృతుడు పెద్దయ్య మామ ఎరుపల్లి సన్యాసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ప్రజాశక్తి -తగరపువలస : 16వ నెంబరు జాతీయ రహదారిపై బోడమెట్టపాలెం వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందిందని భీమిలి ఎస్ఐ జి.హరీష్ ఆదివారం తెలిపారు గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో సుమారు 45 ఏళ్ల వయసు గల మహిళ మృతి చెందిందన్నారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు భీమిలి పోలీస్‌స్టేషన్ 91826 94835 ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు

రైలు ప్రమాద మృతులకు సంతాపం



మౌనం పాటిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఒడిశా బాలాసోర్ జిల్లా, బహనగ రైల్వేస్టేషన్ వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతులకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, నాయకులు ప్రగాఢ సంతాపం, బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఈ మేరకు సమావేశంపై రెండు నిమిషాలు పాటించి, సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు,నాయకులు కె లీలావతి, బోయి వెంకట రమణ, కోరాడ రమణ, కారి అప్పారావు పాల్గొన్నారు

నిరుపేద కుటుంబానికి నిత్యావసరాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం: ఆదర్శ హిందీ ప్రేమీ మండలి 30వ వార్షికోత్సవం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నిరుపేద వై.తులసి కుటుంబానికి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు, అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు నిత్యావసర సరుకులు అందజేశారు. ఆదివారం స్థానిక మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు విద్యార్థులకు హిందీ పుస్తకాలు పంపిణీ చేశారు

కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు సుబ్బన్నకు పుత్రికా వియోగం



నివాళులర్పిస్తున్న లోకనాథం, జగ్గునాయుడు, ఇతర సిపిఎం నేతలు

ప్రజాశక్తి -గాజువాక : కులవివక్ష పోరాట సమితి (కెవిపిఎస్) జిల్లా అధ్యక్షులు ఎం సుబ్బన్న కుమార్తె ఎం.సమత (44) ఆదివారం అక్కిరెడ్డిపాలెంలో మృతి చెందారు. కొంతకాలంలో అనారోగ్యంతో బాధపడుతున్న సమత ఆరోగ్యం, ఆదివారం మధ్యాహ్నం విషమించగా, వెంటనే గాజువాకలోని డాకట్(ఎం. రమేష్‌కుమార్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి, వైద్యసేవలు అందించినప్పటికీ, ఆరోగ్యం విషమించడంతో మృత్యువాత పడిందని కుటుంబసభ్యులు తెలిపారు. మృతదేహాన్ని అక్కిరెడ్డిపాలెంలోని స్వగృహానికి తరలించారు.

పలువురి సంతాపం

కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు సుబ్బన్నకు పుత్రికా వియోగం సమాచారం అందుకున్న సిపిఎం నాయకులు లోకనాథం, ఎం జగ్గునాయుడు, గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు, పార్టీ నాయకులు ఎ.లోకేశ్వరరావు, దాసరి అప్పారావు తదితరులు అక్కిరెడ్డిపాలెంలోని సుబ్బన్న ఇంటికెళ్లి పరామర్శించారు. మృతదేహానికి నివాళులర్పించారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఆరిలోవ : అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆప్‌కాస్ట్ జిల్లా సమన్వయకర్త పి.రాజారావు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచడం అందరి బాధ్యతన్నారు. చెట్లను పెంచడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.. పెరుగుతున్న కాలుష్యం పర్యావరణ సమతుల్యతను ఏవిధంగా నాశనం చేస్తుందో విద్యార్థులకు వివరించారు. వాతావరణ సమతుల్యతకు మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం అవసరమన్నారు. కార్యక్రమంలో స్థానిక బాక్సింగ్ కోచ్ రామారావు, యోగా గురువులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి వార్షిక పండగ

ప్రజాశక్తి- సింహాచలం: రెండేళ్లకోసారి నిర్వహించే 14 గ్రామాల పొలిమేర దేవత సత్తెమ్మ తల్లి పండగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈనెల 13న అడవివరం గ్రామదేవత పైడితల్లమ్మ పండగ జరగనున్న నేపథ్యంలో ముందుగా సత్తమ్మ తల్లి వార్షిక పండుగను ఆనవాయితీగా నిర్వహిస్తారు. ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, ఇతర కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అమ్మవారి పండగ అత్యంత వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. అమ్మవారిని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు పి వెంకటరావు, కార్యదర్శి గంట్ల కనకరాజు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరావు, స్థానిక పెద్దలు గంట్ల కిరణ్, టిడిపి నాయకులు సతివాడ శంకరరావు అడవివరం సహకార పరపతి సంఘం పాలక మండల సభ్యులు ప్రసాద్ రెడ్డి తదితరులు దర్శించుకున్నారు.

పూర్తిస్థాయిలో వినియోగంలోకి

పాత గాజువాక ఆర్‌టిసి బస్‌స్టేషన్

దూరప్రాంత ప్రయాణికులకు ప్రయోజనకరం



వినియోగంలోకి వచ్చిన పాత గాజువాక బస్ స్టాప్.

ప్రజాశక్తి -గాజువాక : పాత గాజువాకలో ఎపిఎస్ఆర్‌టిసి నిర్మించిన బస్‌స్టేషన్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చారు. ఈ బస్‌స్టేషన్‌లో ఎంక్వైరీ ఆఫీస్‌తో పాటు, పూర్తిస్థాయి కంట్రోలింగ్ అధికారిని కూడా ఆర్‌టిసి నియమించింది. విజయవాడ హైదరాబాదు, ఇతర దూరప్రాంతాల నుంచి వచ్చిన ఆర్‌టిసి బస్సులు ఎక్కడ ఆగుతాయో తెలియని సందిగ్ధ పరిస్థితి ఇప్పటివరకు ఉండగా, వాటిని విధిగా ఈ బస్‌కాంప్లెక్స్‌లోని వచ్చి, ఇక్కడి రిజిస్టర్‌లో సంతకం పెట్టి వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవడంతో ప్రయాణికులకు ప్రయోజనకరంగా ఉంది. మరోవైపు గాజువాక మీదుగా విజయనగరం, శ్రీకాకుళం, పలాస, టెక్కలి, కొత్తూరు, పర్లాకిమిడి, బత్తిలి తదితర దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సులు ఈ బస్‌కాంపెక్స్‌లోకి వచ్చి వెళ్లనున్నాయి. గతంలో పాతగాజువాకలోని ఎన్ఎడి వైపు వెళ్లే బస్‌స్టాప్‌లో ఆయా దూర ప్రాంతబస్సులను నిలిపేవారు. ఆయా సెంటర్లలో ఖాళీ ఉంటేనే బస్సులు ఆగేవి, లేకుంటే నేరుగా వెళ్లిపోయేవి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు, కానీ ఇపుడా పరిస్థితి లేదు. అన్ని బస్సులు బస్‌స్టేషన్‌లోకి వచ్చి వెళ్లేలా ఆర్‌టిసి అధికారులు చర్యలు తీసుకున్నారు. మరోవైపు ఆర్‌టిసి



కొత్త బస్‌స్టేషన్‌లోని విచారణ కేంద్రం

పార్సిల్ సదుపాయం కూడా ఈ స్టేషన్‌లో పూర్తిగా అందుబాటులోకి తెచ్చారు. ఇలా అన్ని విధాలా ప్రయోజనకరంగా ఈ బస్‌స్టాప్‌ను తీర్చిదిద్దడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే ఈ బస్‌స్టేషన్‌లో కొన్ని సౌకర్యాలను మెరుగుపరచాల్సి ఉంది. ముఖ్యంగా అప్రోచ్‌రోడ్డు లేకపోవడంతో బస్‌లు వచ్చిపోయేటప్పుడు దుమ్ముధూళి రేగి ప్రయాణికులతోపాటు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. అలాగే మరుగుదొడ్లు, తాగునీరు, సిటింగ్ ఇతరత్రా సౌకర్యాలను ఇక్కడ మెరుగుపరచాల్సి ఉంది. దీనిపై ఆర్‌టిసి అధికారులు స్పందిస్తూ, బస్‌స్టేషన్‌ను ఆనుకున్న ఉన్న అప్రోచ్ రోడ్డు నిర్మాణపనులను ఈ నెలలోనే చేపట్టి, నెలాఖరులోగా పూర్తిచేస్తామని అంటున్నారు.

'గ్రేహౌండ్స్' భూనిర్వాసితులకు పరిహారం అందజేత



రైతులకు పరిహారం చెక్కును అందజేస్తున్న సుబ్బారెడ్డి, ముత్తంశెట్టి

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని చందక పంచాయతీ జగన్నాథపురం గ్రామంలో గ్రేహౌండ్స్‌కు భూమినిచ్చిన నిర్వాసిత రైతులకు ఆదివారం పరిహారం చెక్కులను. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవి సుబ్బారెడ్డి ఆదివారం చెక్కులు అందజేశారు. 127 ఎకరాలకు సంబంధించి, 133 మంది రైతులకు రూ.15.38 కోట్ల చెక్కులను అందజేసారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న గ్రేహౌండ్స్ బెటాలియన్ స్థలానికి సంబంధించి నష్టపరిహారం చెల్లింపు సమస్యను సిఎం జగన్ దృష్టికి స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తీసుకెళ్లగా, ఆయన స్పందించి పరిహారం నిధులు విడుదల చేశారన్నారు.ఇంకా నిర్వాసితులెవరైనా తప్పిపోయి ఉంటే వారికి పరిహారం ఇస్తామని హామీనిచ్చారు. వైసిపి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని భరోసానిచ్చారు. నిర్వాసిత రైతులకు పరిహారం కోసంపట్టుదలతో కృషి చేసి న్యాయం చేసిన ఆర్‌డిఒ, తహశీల్దార్, ఇతర అధికారులను ఎమ్మెల్యే ముత్తంశెట్టి అభినందిచారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, భీమిలి ఆర్‌డిఒ భాస్కరరెడ్డి, జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, ఎంపిపి శారద ప్రియాంక, వైస్ ఎంపిపిలు పాండ్రంకి శ్రీను, తహశీల్దార్ లోకవరపు రామారావు, ఎంపిడిఒ అడపా లవరాజు, వైసిపి మండల ప్రెసిడెంట్ బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరావు, ఎఎంసి వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, భీమిలి యూత్ ప్రెసిడెంట్ ఇల్లాపు వెంకట్ జగన్, చందక సర్పంచ్ బంక శ్రీను, ఎంపీటీసీ విజనగిరి అప్పలనాయుడు రైతులు పాల్గొన్నారు.

యంత్ర సేవా పథకం ట్రాక్టర్లు పంపిణీ

మండలంలో చందక పంచాయతీ జగన్నాథపురంలో వైఎస్ఆర్ యంత్ర సేవా పథకంలో రూ. 1.09 కోట్ల విలువైన 15 ట్రాక్టర్లను రైతులకు అందజేశారు. రూ.36 లక్షల రాయితీతో 15 కస్టమ్ హైరింగ్ సెంటర్ గ్రూపులకు వైవి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జెసి విశ్వనాథన్ అందజేశారు. వ్యవసాయశాఖ జెడి కె.అప్పలస్వామి, ఎడిఎ బి.విజయప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

క్లోమ సంబంధిత వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి -గాజువాక : మానవ శరీరంలో క్లోమ గ్రంథి అత్యంత ముఖ్యమైనదని, దానికి వచ్చే వివిధ రకాల వ్యాధులపై అవగాహన ఎంతో అవసరమని షీలనగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ ఆచంట చలపతిరావు తెలిపారు. ఆదివారం కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో క్లోమ (ప్యాంక్రియాస్) వ్యాధులపై దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సంబంధిత వైద్యనిపుణులతో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి సీఎండీ డాక్టర్ పి.సతీష్ కుమార్ ప్రారంభించిన సదస్సులో డాక్టర్ చలపతిరావు మాట్లాడుతూ, కడుపులో ఏ సమస్య వచ్చినా దాన్ని గ్యాస్ట్రిటిస్ లేదా అజీర్ణం అని తప్పుగా అర్థం చేసుకునే పరిస్థితి ప్రస్తుతం సమాజంలో వేళ్లూనుకుందని, దీని వల్ల రోగ నిర్ధారణలో జాప్యమై, రోగి ఇబ్బందులు పడే పరిస్థితి ఉత్పన్నమౌతుందన్నారు. మద్యపానం, ధూమపానం ఎక్కువ కావడం, పిత్తాశయంలో రాళ్లు చేరిపోవడం వల్ల ప్యాంక్రియాటైటిస్, ప్యాంక్రియాటిక్ కేన్సర్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు.

కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి సీఎండీ డాక్టర్ పి.సతీష్‌కుమార్ మాట్లాడుతూ వివిధ విభాగాల్లో స్థానిక వైద్యులకు అవగాహనకు ఏటా విశాఖలో ఇటువంటి అవగాహన



సదస్సు ప్రారంభిస్తున్న డాక్టర్ సతీష్ కుమార్

సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రోగ చికిత్సలే కాకుండా విద్య, పరిశోధనపరంగా కిమ్స్‌ఐకాన్ ఆసుపత్రిని అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో అధునాతన గ్యాస్ట్రోఎంటరాలజీ, ఎండోస్కోపిక్ సేవల అవసరాన్ని గుర్తించి, ఇప్పుడు ఎంవీపీ కాలనీలో గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగానికి ప్రత్యేక ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేశ్మాన్నారు. ఆ కేంద్రంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో జీర్ణాశయం, కాలేయ సంబంధిత వ్యాధులపై ఎండోస్కోపిక్, సాధారణ శస్త్రచికిత్సలను తమ ఆసుపత్రి వైద్యనిపుణులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అందిస్తారన్నారు.

ముగిసిన సంగీత శిక్షణ శిబిరం



డాక్టర్ వంకాయలను సత్కరిస్తున్న శారద

ప్రజాశక్తి- సీతమ్మధార : పద్మవిభూషణ్, సంగీత కళానిధి, భారతరత్న డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకష్ణ రచించిన తిల్లానాలపై శని,ఆదివారాల్లో పౌరగ్రంథాలయంలో సంగీత శిక్షణా శిబిరం ఘనంగా జరిగింది. విమలకృష్ణ మ్యూజిక్ అకాడమీ అధ్యక్షులు డాక్టర్ మండపాక శారద నిర్వహణలో అహిర్ భైరవి, కుంతల వరాళి, కదనకుతూహలం , బేహాగ్ రాగాలలో తిల్లానాలు నేర్పారు. రెండోరోజు ప్రసిద్ధ మృదంగ విద్వాంసులు వంకాయల వెంకట రమణమూర్తికి బెనారస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భంగా విమలకృష్ణ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అకాడమీ గౌరవ అధ్యక్షులు ఎం.ఎస్ శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న చిన్నారి కళాకారులు

ప్రజాశక్తి -పిఎం.పాలెం : మధురవాడ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శ్రీసాయి కళానికేతన్ కూచిపూడి నాట్యమండలి వారిచే శాస్త్రీయ, జానపద నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పాట, దశావతారం, శ్రీ విష్ను రాజంభజే, కల్యాణ రామ, అమ్మ అమ్మ, లలితా హారతి, శివ తాండవ, నాగేంద్ర హరయ, సీతా కల్యాణం, వరాహ రూపం, స్వాగతం కృష్ణ, కోయిలరే , వదినకు ఒకసారి, గాజుల సవ్వడి తదితర నృత్యరీతులను ప్రదర్శించారు.అనన్య, నైపుణ్య, లాస్య శ్రీ, యోగిత, బిందు, మహాలక్ష్మి, యశ శ్రీ, విజయ, లలితా, అక్షిర, వేదమయి, నిక్షిప్త, దీక్ష, లక్ష్మి అక్షయ, తదితర కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, అభినయం సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలనాధికారి టి. విశ్వనాథ్ రెడ్డి తెలిపారు.

బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే అరెస్టు చేయాలి

◆ ప్రభుత్వం స్పందించకపోతే ప్రత్యక్ష కార్యాచరణ
◆ రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు

ప్రజాశక్తి- అనకాపల్లి

మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధింపులకు గురి చేసిన రెజ్లింగ్ ఫెడరేషన్ చైర్మన్, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని న్యాయవాదులు, పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. మహిళా రెజ్లర్లకు సంఘీభావంగా ప్రజాసంఘాల ఆధ్వర్యాన స్థానిక నాల్గు రోడ్ల సెంటర్లోని శ్రామిక సదన్లో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జిల్లా కార్యదర్శి శేఖర్‌మంత్రి సాయి వెంకట లక్ష్మణరావు, అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పిఎస్.అజయ్ కుమార్ మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులపై విచారించి శిక్ష విధించడానికి వీలుగా పటిష్టమైన నియమ, నిబంధనలు ఉన్నాయని, అందులోనూ బాలికల విషయంలో చట్టాలు మరింత కఠినంగా ఉన్నాయని తెలిపారు. అయినా బ్రిజ్ భూషణ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు.

ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి మాట్లాడుతూ సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటే తప్ప మోడీ సర్కార్ బ్రిజ్ భూషణ్‌పై కేసు నమోదు చేయలేదన్నారు. నేటికీ ఆయన్ను పదవి నుంచి తొలగించలేదని, కస్టడీలోకి తీసుకొని విచారించలేదని పేర్కొన్నారు. తమ పార్టీ ఎంపీని రక్షించడానికి బిజెపి ప్రభుత్వం చట్టాన్ని ఉల్లంఘిస్తుందని విమర్శించారు. సీనియర్ న్యాయవాది ఐఆర్ గంగాధర్ మాట్లాడుతూ మహిళా రెజ్లర్ల పోరాటానికి సంఘీభావంగా జిల్లాలోని న్యాయవాదులందరూ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. న్యాయవాది కళావతి మాట్లాడుతూ మహిళా రెజ్లర్ల విషయంలో మోడీ సర్కారు తీరును సభ్య సమాజం ఖండించాలన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదులు కనిశెట్టి సురేష్ బాబు, గంట సురేష్, స్ఫూర్తి సంస్థ కార్యదర్శి శివాజీ, ప్రజా సంఘాల నాయకులు ఎం.మాధవరావు, ఎ.బాలకృష్ణ, కాళ్ళ తేలయ్య బాబు, వియ్యపు రాజు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దాసరి సంతోష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజయ్‌కుమార్, పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు, న్యాయవాదులు



రక్తదానం చేస్తున్న యువకులు

బాలాసోర్ బాధితుల సహాయార్థం రక్తదానం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఒడిశా బాలాసోర్ రైలు ప్రమాద బాధితుల సహాయార్థం మండలంలోని కొత్తూరు నరసింగరావుపేట గ్రామంలో ఆదివారం అత్యవసర రక్తదాన శిబిరం ప్రేరక్ ఆర్గనైజేషన్, కల్చరల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. సాలాపు హరికృష్ణ ప్రసాద్, దివాకర్, మోహన్ కుమార్, గొల్లపల్లి రాము, వివిఎస్ నరేంద్ర, ఎంజి అబ్బాస్, కే.రాజు, ఏ.భరత్, ఏ.గణేష్, ఆర్‌వై.ప్రసాద్ రక్తదానం చేశారు. ఇందులో పాల్గొన్న అనకాపల్లి రూరల్ సిఐ రవికుమార్ మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానం వంటిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేరక్ ఆర్గనైజేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు రాంప్రసాద్, గజ్జాలు, కసిరెడ్డి అప్పల కొండ, కల్చర్ ఫౌండేషన్ ప్రతినిధులు సాలాపు హరి, అబ్బాస్, గ్రామపెద్దలు నడిపల్లి వెంకటరమణ, గొల్లవిల్లి జానకీరామ్, గొల్లవిల్లి రాజు, కసిరెడ్డి వెంకటేష్, స్థితప్రజ్ఞ కుమార్, కాకర రాజు పాల్గొన్నారు.



అంతిమ యాత్రలో పాల్గొన్న యువకులు, ఇన్‌సెట్‌లో అప్పలనాయుడు (ఫైల్‌ఫొటో)

క్రీడాకారుడు అప్పలనాయుడుకు కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

మండలంలోని రాజాం గ్రామానికి చెందిన క్రీడాకారుడు పరవాడ అప్పలనాయుడు అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. కొద్దికాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న అప్పలనాయుడు విశాఖలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వాలీబాల్, రన్నింగ్, క్రికెట్, కోకో, లాంగ్ జంప్ క్రీడలలో అప్పలనాయుడుకు మంచి ప్రావీణ్యం ఉంది. డిఫెన్స్ ఉద్యోగాలకు ప్రయత్నించే యువతకు రన్నింగ్, లాంగ్ జంప్‌లో అప్పలనాయుడు కోచ్‌గా శిక్షణ ఇచ్చేవాడు. క్రీడల్లో పలు జాతీయ అవార్డులను సైతం సాధించాడు. రాజాంలో నిర్వహించిన అప్పలనాయుడు అంతిమయాత్రకు చుట్టు పక్కల గ్రామాల నుండి యువకులు అధిక సంఖ్యలో తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు. అప్పలనాయుడు చిత్రపటంతో అమర్ రహే అప్పలనాయుడు అంటూ దారి పొడవునా నినాదాలు చేశారు. చిన్న వయసులో అప్పలనాయుడు మృతి చెందడంతో పలువురు యువకులు కన్నీటి పర్యంతమయ్యారు. మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మరిసా నాని తదితరులు ఇందులో పాల్గొన్నారు.

కౌలు రైతుల రక్షణయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- మునగపాక రూరల్

కౌలు రైతుల రక్షణ కోసం రాష్ట్ర యాత్ర ఈ నెల 5న సోమవారం మండల కేంద్రం మునగపాకలో ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు ప్రారంభిస్తారని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కాండ్రేగుల రాము తెలిపారు. ఈ జాతా మునగపాక నుండి అమరావతి వరకు జరుగుతుందని పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో ఆదివారం రక్షణ జాతా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతులను నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. వీరికి ఏ విధమైన గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంతో బ్యాంకులో రుణాలు, పంట నష్ట పరిహారాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు, రైతు భరోసా వంటివి ఏవీ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు వ్యవసాయంలో నూటికి 60 నుండి 70శాతం కౌలు రైతులే సాగులో ఉన్నారని చెప్పుకుంటున్న ప్రభుత్వాలు వారికి ఏమాత్రం సహాయం చేయకపోవడం దారుణమన్నారు. పైగా రైతుల ఆమోదం లేకుండా గుర్తింపు కార్డు ఇవ్వబోమని చట్ట సవరణ చేయటం దుర్మార్గమన్నారు. రెండు రోజులపాటు అనకాపల్లి జిల్లాలో యాత్ర సాగుతుందని, కౌలు రైతులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని దీనిని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, రైతు సంఘం నాయకులు టెక్కలి జగ్గారావు, సిఐటియు నాయకులు వివి.శ్రీనివాసరావు, ఎస్.బ్రమ్మాజీ, పెంటకోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు నాయకులు

కౌలు రైతుల సంక్షేమానికి రూ.10వేల కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : కౌలు రైతుల రక్షణ, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేల కోట్ల నిధులు కేటాయించి ఆదుకోవాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. సిపిఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన కౌలు రైతుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు తక్షణమే ఇచ్చే విధంగా నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. గ్రామ సభలు నిర్వహించి భూ యజమానులతో సంబంధం లేకుండా, షూరిటీ లేకుండా పంట రుణాలు రూ.1.65 లక్షల వరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు వేచలపు వెంకటరమణ, రెడ్డి అప్పలరాజు, మేక సత్యనారాయణ, కోరుబిల్లి శంకర్రావు, రాజాన దొరబాబు, జి.దేవుడుబాబు, నరాలశెట్టి సత్యనారాయణ, ఈశ్వరరావు, వియ్యపురాజు పాల్గొన్నారు.

'మానవత్వం లేని సిఎం జగన్'

ప్రజాశక్తి -అనకాపల్లి

ఒడిశాలోని బాలాసోర్‌లో జరిగిన రైలు ప్రమాదంలో వందలాది కుటుంబాల్లో పెనువిషాదం నింపిన సందర్భంలోనూ మానవత్వం చూపని పెత్తందారీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక ప్రజలు ఇతోధికమైన మానవత్వాన్ని చాటుకుని క్షతగాత్రులకు సహాయం అందించడంతోపాటు ఆసుపత్రులకు తరలించి వందలాది మంది యువకులు రక్తదానం చేయడానికి ముందుకొచ్చారని, వారందరికీ నాగజగదీశ్వరరావు వందనాలు తెలియజేశారు. మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రి ప్రమాద ఘటన స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 348 మంది ప్రయాణికులు ఉన్నారని, 113 మంది ఆచూకీ తెలియడం లేదని తెలిసినా జగన్ రెడ్డి తాడేపల్లికే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆ రాష్ట్రానికి చెందిన ప్రజలు ఉన్నా, లేకపోయినప్పటికీ స్పందించి ప్రత్యేక రైల్లో అధికార బృందాన్ని పంపి చర్యలు తీసుకున్నారని కొనియాడారు. రాష్ట్ర మంత్రి అమర్‌నాథ్ తీరిగ్గా ప్రమాదం జరిగిన మరుసటి రోజు సాయంత్రానికి వెళ్లి పరామర్శించారని ఆరోపించారు. పత్రికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు అనేక ఇబ్బందులు పడినట్లుగా కథనాలు వచ్చినా, వారి పట్ల ఏం చర్యలు తీసుకున్నారో ప్రకటన చేసే ధైర్యం మంత్రులకు లేకపోయిందని మండిపడ్డారు.

అంగన్వాడీ యూనియన్ శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-మునగపాక రూరల్

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ప్రాంతీయ శిక్షణ తరగతులు మండలంలోని తిమ్మరాజుపేటలో ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆరో తేదీ వరకు జరిగే ఈ శిక్షణ తరగతులను యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం సుబ్బారావమ్మ ప్రారంభించారు. వేతనాలు- కార్మికులు అనే అంశంపై సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్ కుమార్ బోధించగా, అంగన్వాడీలు- గ్రాట్యూట్ అనే అంశంపై సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు వివరించారు. శ్రీకాకుళం జిల్లా నుండి కృష్ణాజిల్లా వరకు గల జిల్లాల అంగన్వాడీ కార్యకర్తలు ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యారు.



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అంగన్వాడీ యూనియన్ ప్రతినిధులు

సందేశాన్ని ఇచ్చిన నాటిక పోటీలు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక జార్జి క్లబ్ వైకే నాగేశ్వరరావు నాటక కళాపరిషత్, ఆది లీల ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జార్జి క్లబ్ కొణతాల వెంకటనారాయణమ్మ కళా ప్రాంగణంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు ప్రదర్శనలో గుంటూరు అమృత లహరి థియేటర్ ఆర్ట్స్ సౌజన్యంతో 'నాన్నా నేనొచ్చేస్తా', చిలకలూరిపేట ది అమ్మెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ వారి 'ఆలీతో సరదాగా' నాటికలను ప్రదర్శించారు. తాళాబత్తుల వెంకటేశ్వరరావు నాటకీకరణలో అమృత లహరి దర్శకత్వంలో ప్రదర్శించిన 'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక సంక్షిప్త కథను పరిశీలిస్తే... నేటి సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లలను చదువు నుంచి పెళ్లి వరకు వారికి కావలసింది సమకూరుస్తున్నారు. మితిమీరిన మమకారంతో పెంచిన ఫలితంగా పెళ్లయిన కొంతకాలానికే వైవాహిక జీవితంలో వచ్చిన మనస్పర్ధలను పరిష్కరించుకోలేకపోతున్నారు. పెళ్లంటే సర్దుబాటు, సంసారం అంటే దిద్దుబాటు అన్న సూత్రాన్ని విస్మరించి మెట్టింటి నుంచి పుట్టింటికి వస్తున్నారు. సుధ లాంటి అమ్మాయికి, భర్త శ్రీరామ్‌కి, తల్లిదండ్రులు సావిత్రి రాఘవ మధ్య జరిగిన సంఘర్షణల దృశ్య రూపమే ఈ నాటిక. రెండోనాటికగా ప్రదర్శించిన ఆలీతో సరదాగా ఇతివృత్తాన్ని పరిశీలిస్తే... ప్రపంచీకరణ నేపథ్యంలో పెరిగిన సాంకేతిక విజ్ఞానంతో నేటి తరం ఉన్నత ఉద్యోగాలతో పాటు అధిక ఆదాయం సంపాదిస్తోంది. ఆదాయం అవసరాలకు మించి ఉండడంతో వారి బుద్ధి వెర్రి తలలు వేస్తోంది. కొత్త కొత్త సరదాలు పలు అనర్థాలకు దారితీస్తుంది. ఈ నిజాన్ని హాస్యంతో మేళవించి నేటి యువత విజ్ఞతతో వ్యవహరించాలని తెలియజేప్పేదే ఆలీతో సరదాగా నాటిక. ఈ నాటిక ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తూ ఒక సందేశాన్ని ఇచ్చింది. కార్యక్రమంలో జార్జి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బుద్ధ కాశి విశ్వేశ్వరరావు, మళ్ల చంద్రశేఖర్, ఆళ్ల వెంకట నూకేశ్వరరావు కళాపరిషత్ నిర్వాహకులు బొప్పన నరసింహారావు, జి.మల్లికార్జునరావు, నడింపల్లి వెంకటేశ్వరరావు, ఎస్ ఆదినారాయణ, నాటిక పోటీల కన్వీనర్ కేఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.



నాన్నా నేనొచ్చేస్తా నాటికలోని ఓ సన్నివేశం



ప్రజలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

సమస్యలను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఆదివారం ఉదయం ఆరు గంటలకే ఆయన నీలకంఠాపురంలో పర్యటించారు. తన దృష్టికి వచ్చిన అనేక సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. గ్రామంలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షుడు అచ్చం నాయుడు, సర్పంచ్ పడాల నాగభూషణం, అధికారులు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

పర్యావరణ పరిరక్షణపై కళాజాతా

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏపి కాలుష్య నియంత్రణ మండలి జిల్లా రీజనల్ మేనేజర్ ఆధ్వర్యంలో విభూది బ్రదర్స్ కల్చరల్ సొసైటీ బృందం పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడానికి కళాజాతా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం గవరపాలెం పార్క్ సెంటర్, సంత బయలు తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని, ప్లాస్టిక్ వల్ల వచ్చే అనర్థాలు, కాలుష్య కారకాలు, కాలుష్య నియంత్రణ వంటి అంశాలపై ప్రజలను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో బృంద సభ్యులు వి.శాంతారామ్, వై.చిరంజీవి, వి రాజు పాల్గొన్నారు.

బ్రెటర్ మైండ్స్‌తో పిల్లల్లో మేధాశక్తి, ఉత్తేజం

ప్రజాశక్తి-అనకాపల్లి

బ్రెటర్ మైండ్స్ విధానం వల్ల విద్యార్థుల్లో మేధాశక్తి, ఉత్తేజం పెంపొందుతాయని బ్రెటర్ మైండ్స్ సంస్థ నిర్వాహకులు పద్మలీల, మీనాక్షి పేర్కొన్నారు. స్థానిక రింగ్ రోడ్ కోలపర్తి భవనంలో ఆదివారం హర్ట్ ఫుల్ నెస్ సంస్థ, శ్రీరామచంద్ర మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు కళ్ళకు గంతలు కట్టి చదవడం, రాయడం వంటి కృత్యాలను చేసి చూపించారు. ఈ విధానం వల్ల పిల్లల్లో జ్ఞాపక శక్తి, మేధాశక్తి, ఉత్తేజం పరిజ్ఞానం కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కోలపర్తి భవన నిర్మాణ స్థాపకులు జయ బాబు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకున్న విద్యార్థులను పరీక్షిస్తున్న దృశ్యం

ఆసుపత్రి ఉన్నా అందని పశువైద్యం

- పర్మినెంట్ పశువైద్యాధికారి లేక ఇబ్బందులు
- తక్షణమే నియమించాలని రైతులు వేడుకోలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని చౌడువాడ మేజర్ పంచాయితీలో గల పశువుల ఆసుపత్రికి పూర్తి కాల పశు వైద్యాధికారిని నియమించాలని చౌడువాడ, ఆ ఆసుపత్రి పరిధిలోని గ్రామాల రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులు కోరుతున్నారు. ఈ ఆసుపత్రి పరిధిలో చౌడువాడ గ్రామంతో పాటు ఆ పంచాయతీ పరిధిలోని మల్లంపాలెం, గరుగుబిల్లి, పాచిలవానిపాలెం గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో 80 శాతం మంది రైతులు పశుపోషణపై ఆధారపడి జీవన సాగిస్తున్నారు. అధికంగా పాడిపశువులను పెంచుకుంటూ పాలును విశాఖ డెయిరీ, హెరిటేజ్ డెయిరీలకు పోస్తున్నారు. మండలంలోని ఏ గ్రామంలో లేనన్ని పాల సేకరణ కేంద్రాలు చౌడువాడలో ఉన్నాయి. మేలు జాతి ఆవులు, గేదెలను వీరు పెంచుతున్నారు. అలాగే గొర్రెలు మేకల పెంపకందారులు కూడా ఎక్కువమంది ఉన్నారు.

పశువులు, గొర్రెలు, మేకలు అనారోగ్యానికి గురైతే చౌడువాడ పశువుల ఆసుప్రతిలో వైద్యం చేయడానికి పూర్తిస్థాయి డాక్టరు లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఆసుపత్రికి ఇన్‌ఛార్జి డాక్టర్‌గా మండలంలోని కొరువాడ పశు వైద్యాధికారిని నియమించారు. ఆయన ఎప్పుడో పది రోజులకు 15 రోజులకు వస్తూ ఉంటారు. ఆస్పత్రిలో అసిస్టెంట్ డాక్టర్ ఒకరు ఉన్నా ఆయనకు పశువులకు, గొర్రెలకు, మేకలకు వైద్యం చేయడం రాదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయన ఎప్పుడు ఆస్పత్రికి ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో ఆయనకే తెలీదు. దీంతో గ్రామంలో పశువుల ఆసుపత్రి ఉన్నప్పటికీ నిరుపయోగంగా ఉంది.

పశువులు అనారోగ్యానికి గురైనప్పుడు ప్రైవేటు పశు వైద్యాధికారులను సంప్రదించాల్సి వస్తోంది. దీంతో వారు పశు వైద్యం పేరుతో వేల రూపాయలు రైతుల వద్ద నుండి గుంజుతున్నారు. పశువులకు చూడు ఇంజక్షన్, చూడు తనిఖీ మొదలైన వాటికి అధిక రేటు వసూలు చేస్తున్నారు. రైతులు చేసేదిలేక వారు అడిగినంత డబ్బులు ప్రైవేటు పశు వైద్యులకు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఎక్కువ పశువులు ఉండి, ఎక్కువగా పాడి పరిశ్రమ మీద ఆధారపడిన రైతులు ఉన్న గ్రామంలో పర్మినెంట్ పశువైద్యాధికారి లేకపోవడంతో తమ పశువులను వ్యాధుల నుండి రక్షించుకోవడానికి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ గ్రామం పట్ల, తమ పట్ల చిన్న చూపు చూస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఈ పంచాయతీ పరిధిలో రెండు సచివాలయాలు ఉన్నాయి. గ్రామంలో పశువుల ఆసుపత్రి ఉండడం వల్ల సచివాలయ పశు వైద్య సహాయకులను నియమించలేదు. కనీసం వారు ఉన్నా వారితో పశువులకు వైద్యం చేయించుకునేవాళ్లమని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చౌడువాడ పశువుల ఆసుపత్రికి పూర్తి కాల పశు వైద్య అధికారిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.



చౌడువాడ పశువుల ఆసుపత్రి

మధుర గాయకుడు ఎస్‌పి.బాలు

జయంతి వేడుకల్లో ఇంద్రగంటి లక్ష్మీశ్రీనివాస్

ప్రజాశక్తి-అనకాపల్లి

సినీ చరిత్రలో అందరు హీరోలకు తన గళాన్ని పాట ద్వారా అందించిన మరచిపోలేని మధుర గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అని కళ్యాణి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ వ్యవస్థాపకులు, సినీ సంగీత దర్శకులు ఇంద్రగంటి లక్ష్మీ శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఉడ్పేట కళ్యాణి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్‌లో ఆదివారం పద్మవిభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 77వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలు చిత్రపటానికి పూలమాలవేసి నివాళి లర్పించారు. అనంతరం లక్ష్మీ శ్రీనివాస్ మాట్లాడుతూ మర్యాదరామన్న చిత్రం ద్వారా గాయకునిగా సినీ రంగప్రవేశం చేసి 2020 సంవత్సరం వరకు 50,000కు పైగా పాటలు పాడారని తెలిపారు. సంగీత దర్శకునిగా, డబ్బింగ్ ఆర్టిస్టుగా, నటునిగా, నిర్మాతగా అనేక శాఖలలో తనదైన ముద్రను వేశారని కొనియాడారు. 2002 జూన్ 21 ప్రపంచ సంగీత దినోత్సవం రోజునే తన కళ్యాణి అకాడమి ప్రారంభ ముహూర్తం బాలు సూచించారని తెలిపారు. అనంతరం కళ్యాణి అకాడమి విద్యార్థులు ఆలపించిన బాలు మధుర గీతాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో అకాడమి ప్రిన్సిపాల్ నడిగట్ల వెంకటలక్ష్మి, డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ మెంబర్ (డివిఎంసి) రేబాక మధుబాబు, అకాడమి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎస్‌పి బాలు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పలుచోట్ల భారీ వర్షం

ఈదురుగాలులతో విద్యుత్‌కు అంతరాయం



భారీగా ఈదురుగాలులు వీస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గొలుగొండ

మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం నాలుగున్నర గంటల నుంచి భారీ వర్షం కురిసింది. మండలంలో ఏఎల్‌పురం, నాగాపురం, కొంగ సింగి, లింగంపేట, చోద్యం, కొత్తమల్లంపేట, గొలుగొండ తదితర ప్రాంతాల్లో సుమారు గంటన్నర సేపు భారీ గాలులతో కూడిన వర్షం కురిసింది. గత నాలుగు రోజుల నుంచి విపరీతమైన ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజానీకం ఈ వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఈ వర్షంతో ఉపశమనం పొందారు. ఈదురుగాలులతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

కశింకోట : మండలంలో ఆదివారం మధ్యాహ్నం తరువాత కురిసిన వర్షానికి ప్రజలు సేదతీరారు. ఉదయం నుండి విపరీతమైన ఎండ కాయడంతో ఉక్కపోత వల్ల ప్రజలు అల్లాడిపోయారు. మధ్యాహ్నం 3.20 గంటల తర్వాత ఆకాశం మేఘావృతమైన వర్షం జల్లులు కురిసాయి. మూడు రోజులుగా తీవ్ర ఎండ తీవ్రత అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షంతో కొంత సేదతీరారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు, రచయితలు

'సన్మార్గ సాధన శతకం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-చోడవరం

విశ్రాంతి తెలుగు అధ్యాపకులు మల్లాది సోమేశ్వర శర్మ రచించిన సన్మార్గ సాధన శతకం అనే పుస్తకాన్ని ఆదివారం చోడవరంలో మదర్ థెరిసా పారామెడికల్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత శర్మ మాట్లాడుతూ నేటి ఆధునిక పరిస్థితుల్లో యువత పెడదారిన పడుతుందని తెలిపారు. డబ్బే ప్రధానంగా, మానవ సంబంధాలు దూరమవుతున్న తరుణంలో ప్రజలకు సన్మార్గంలో నడిచే రచనలు ముందుకు రావలసిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. పేరి వెంకట రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయులు నాదముని గోపాలాచార్యులు, ప్రముఖ రచయిత నండూరి రామకృష్ణ, మదర్ థెరిసా కాలేజీ నిర్వాహకులు ఎవిఎస్‌విఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం భూమిని కాపాడుకుంటాం

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామ పరిధిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన భూమిని కాపాడుకుంటామని జనసేన బుచ్చయ్యపేట మండల అధ్యక్షులు డిఎస్.నాయుడు, ఉపాధ్యక్షులు తుమ్మపాల రమేష్, దొండా సాయి, ఎడ్ల రామ్మూర్తి స్పష్టం చేశారు. ఈ భూమిని అన్యాక్రాంతం చేసే ప్రయత్నాలను అడ్డుకుంటామన్నారు. దేవస్థానం భూమిని కౌలుకు చేస్తున్న రైతులను ఆదివారం జనసేన నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ భూమిని అన్యాక్రాంతం చేయడానికి చాలా శక్తులు ప్రయత్నాలు చేయగా, వడ్డాది గ్రామ ప్రజలు దీటుగా ఎదుర్కొని, ఈ భూమిలో ఉన్న కొబ్బరి మొక్కలను పీకి వేసి దానిని రక్షించుకోవడం జరిగిందని తెలిపారు. మళ్లీ ఇప్పుడు ప్రభుత్వ పెద్దలు ఈ భూమి ఆక్రమించడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని, దానిని అడ్డుకుంటామని స్పష్టం చేశారు.



రైతులతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

బాలసోర్ ప్రమాదానికి ప్రధాని, రైల్వే మంత్రి బాధ్యత వహించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో జరిగిన రైలు ప్రమాదానికి ప్రధానమంత్రి, రైల్వే శాఖ మంత్రి బాధ్యత వహించాలని ఎఐటియుసి జిల్లా కో-కన్వీనర్ కోన లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ప్రమాదంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం ప్రకటించారు. ఈ ప్రమాదానికి నూటికి నూరు శాతం ప్రభుత్వ లోపమేనని పేర్కొన్నారు. లోకో సిబ్బందిపై ఒత్తిడి, పని భారం, సరిపడా సిబ్బంది లేకపోవడం, కొత్త నియామకాలు చేయకపోవడం, కొన్ని విభాగాలను ప్రైవేటు రంగానికి అప్పగించడం వల్ల ఈ ఘోర దుర్ఘటన జరిగిందని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు, కుటుంబంలో ఒకరికి రైల్వేలో ఉద్యోగం, క్షతగాత్రులకు రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గిరిజనేతరుల పట్టాలు రద్దు చేయాలి

-పనసలపాడులో గిరిజనుల ఆందోళన


నినాదాలు చేస్తున్న గోవిందరావు, గిరిజనులు

ప్రజాశక్తి-రోలుగుంట:జగనన్న భూ రీ సర్వేలో గిరిజన భూములను గిరిజనేతరలకు ఇచ్చిన పట్టాలు రద్దు చేయాలని రోలుగుంట మండలం పనసలపాడు గ్రామంలో ఆదివారం ఆదివాసి గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ, రోలుగుంట మండలం పనసలపాడు రెవెన్యూ పరిధిలో 12 ఆదివాసి గిరిజన భగత కుటుంబాలు(ఎస్టీ) తన వారసత్వ భూములో వరి, చెరకు వంటి పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. సర్వే పూర్తయిన తర్వాత డిఎల్ఆర్ క్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ రెవెన్యూ గ్రామంలో 9(2) నోటీస్ ఇచ్చి వారి అంగీకార పత్రం సంతకం పెట్టి ఇవ్వాలని, 15 రకాలైన రూల్స్ పాటించవలసి ఉంటుందన్నారు. సర్వే నెంబర్ 8-1. 6-9లో ఎస్.ఎఫ్.ఏ రికార్డు ప్రకారంగా గిరిజనుల పేరు మీద ఉందన్నారు. జగనన్న భూ-రీ సర్వేలో గిరిజనేతరులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చారన్నారు. సర్వే నెంబర్ 6-1లో 10 గిరిజన కుటుంబాలు గత వారసత్వంగా సాగు చేస్తున్నారన్నారు. గిరిజనులకు పట్టాలు ఇవ్వాల్సింది పోయి గిరిజనేతలకు పట్టాలు ఇచ్చారన్నారు. ఈ విషయంపై నర్సీపట్నం ఆర్డీవోకు ఫిర్యాదు చేయగా పట్టాలు గిరిజనేతలకు ఇవ్వలేదని చెబుతున్నారన్నారు. ఆర్ఒఆర్ రిజిస్టర్ ప్రకారం గిరిజనేతలకు పట్టాలు ఇచ్చినట్టుగా చూపిస్తున్నారన్నారు. ఈ పట్టాదార్ పాస్ పుస్తకాలు రద్దు చేయాలని, జాయింట్ కలెక్టర్ సమగ్రమైన విచారణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజనులు గెమ్మెల చిన్నబ్బాయి, మచ్చికొండ, గెమ్మెల ఈశ్వరమ్మ పాల్గొన్నారు.


అబిడ్ సెంటర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు


శారదానగర్‌లో జలమయమైన వీధి

చెరువుల్లా రహదారులు

కొద్దిపాటి వర్షానికే పొంగుతున్న డ్రెయినేజీలు
రోడ్డుపైకి చేరుతున్న మురుగునీరు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: కొద్దిపాటి వర్షం వస్తే చాలు పట్టణంలో వీధులు, డ్రెనేజీలు చెరువులను తలపిస్తున్నాయి. ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి అబీద్ సెంటర్ నుండి పాల్గాట్ సెంటర్ వరకు రోడ్లు జలమయమయ్యాయి. శారదానగర్ బొంబాయి టైలర్ వీధి మురుకువాడలను తలపించేలా మారింది. మున్సిపాల్టీ ప్రధాన రహదార్లలో సరైన డ్రెనేజ లేక పోవడం, ఉన్న డ్రెయినేజీలో పూడికలు తీయక పోవడంతో చిన్నపాటి వర్షాలకు రోడ్లన్నీ మురుగు నీరుతో ఏరులై పారుతున్నాయి. చెత్తా, చెదారం ఇళ్ళలోకి వస్తుంది. పాలకులు మారినా నర్సీపట్నం మున్సిపాలిటీ అభివృదికి నోచుకోవలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన పాలకులు, అదికారులు కనీసం డ్రెనేజిల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు కోరారు.


హాజరైన చిన్నారులు

కొనసాగిన వేసవి శిబిరాలు

ప్రజాశక్తి-గొలుగొండ:విద్యార్థులు రోజు గ్రంధాల యానికి వచ్చి పుస్తకాలు చదవాలని గ్రంధాలయాధికారి రాజుబాబు సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు కొత్త కొత్త విషయాలను తెలుసుకోవడానికి ఆసక్తి చూపించాలన్నారు.

మునగపాకరూరల్:స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం ఉపాధ్యాయులు శివకోటి దుర్గాప్రసాద్ విద్యార్థులకు దేశభక్తి గీతాల ఆలాపన పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభక్తి గీతాలు ఆలపించడం ద్వారా విద్యార్థులలో దేశభక్తితో పాటుగా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పారు. తదనంతరం నీతి కథలు, వాటి సారాంశాన్ని బోధించారు. గ్రంథాలయాధికారి ఎల్వి రమణ, బీడీసీ నిర్వాహకులు కేవీ ఎస్ అప్పారావు పాల్గొన్నారు.


కురుస్తున్న మంచు


ఎండతో రోడ్డు నిర్మానుష్యం


కురుస్తున్న వర్షం

ఒకే రోజులో మూడు కాలాలు

ఉదయం మంచు..
మధ్యాహ్నం ఎండ, సాయంత్రం వర్షం

ప్రజాశక్తి-కోటవురట్లం:మండల కేంద్రంలో ఆదివారం ఒకేరోజు మూడు కాలాలు దర్శన మిచ్చాయి. ఉదయం మంచు, మధ్యాహ్నం ఎండ, సాయంత్రం వానతో మూడు కాలాలను తలపించాయి. భిన్న వాతావరణంతో ప్రకృతి ప్రేమికులు హర్షం వ్యక్తం చేశారు. తెల్లవారు జామున మంచు కురియగా, మధ్యాహ్నం భానుడు నిప్పులు చెరిగాడు. సాయంత్రం ఒకసారిగా వాతావరణంలో మార్పులు చేసుకుని మోస్తరు వర్షపాతం నమోదయింది. అప్పటివరకు ఎండ వేడిమితో అల్లాడిన ప్రజలకు వర్షంతో కాస్త ఉపశమనం లభించింది.

మోదకొండమ్మకు వెండి కుందుల విరాళం

ప్రజాశక్తి-మాడుగుల: గోపాలపట్నంకు చెందిన దంపతులు మాడుగుల మోదకొండమ్మ అమ్మవారికి ఆదివారం వెండి వస్తువులు బహూకరించారు. పుట్టా వరుణ్ గాంధీ దంపతులు 868 గ్రాముల కుందులు, పూజా పల్లె ములు అందించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాథ్ శ్రీనివాసరావు,పైడి నాయుడు, భవాని శంకర్, ఢిల్లీ నానాజీ పాల్గొన్నారు.


మెమొంటో ఇస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దుకాణాల వేలం

ప్రజాశక్తి-మాడుగుల:మండల కేంద్రంలోని మోదకొండమ్మ ఆలయం వద్ద వివిధ దుకాణాలకు ఆదివారం వేలం నిర్వహించారు. హల్వా దుకాణానికి నెలకు రూ.27500, కొబ్బరి కాయలు షాపుకు రూ.1600, టీ షాపుకు రూ.4500 చొప్పున వేలం ఖరారు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వ్యాపారులు పాల్గొన్నారు.

రూ.61లక్షల నిధులు మంజూరు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని పలు పంచాయతీల అభివృద్ధికి జెడ్పీటీసీ నిధులు రూ.40లక్షలు, 15వ ఫైనాన్స్ నుంచి రూ.21లక్షలు కలిపి రూ.61లక్షలు మంజూరు చేసినట్లు జెడ్పీటీసీ పోతుల లక్ష్మీ రమణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బుచ్చింపేట, కుసర్లపూడి, జెపి.అగ్రహారం, రొంగలపాలెం, నిండుగొండ, కంచుగుమ్మల పంచాయతీల్లో సిసి రోడ్ల నిర్మాణానికి రూ.4లక్షలు, రోలుగుంటలో సిసి రోడ్ల నిర్మాణానికి రూ.3లక్షలు, కె.నాయుడుపాలెం, బిబి.పట్నం పంచాయతీల్లో శ్మశాన వాటికలకు రూ.4లక్షల చొప్పున, కమ్యూనిటీ హాలు నిర్మాణాలకు మునిపల్లికి రూ.4లక్షలు, ఆర్ల గిరిజన పంచాయతీకి రూ.2లక్షలు, ఎంకె.పట్నానికి రూ.3లక్షలు, కొవ్వూరుకు రూ.3లక్షలు, రోలుగుంట శెట్టి శ్రీను పాకల వద్ద -1, కొమరవోలుకు -2, పడాలపాలెం-2 తాగునీటి బోర్లకు రూ.5లక్షలు, రోలుగుంటలో జీవకారుణ్య సంఘం భవన నిర్మాణానికి రూ.5లక్షలు, నిండుగొండలో డ్రైనేజీల నిర్మాణానికి రూ.4లక్షలు మంజూరు చేశామన్నారు. ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సూచనలతో ఆయా పంచాయతీల గుర్తించిన ఈ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.


పనులను పరిశీలిస్తున్న సర్పంచ్, తదితరులు

పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-మాడుగుల:గ్రామ దేవత పండగ సందర్భంగా గ్రామంలో ఆదివారం పారిశుధ్య పనులు చేపట్టారు. అనేక ప్రాంతాల నుండి పండగను తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, కార్యదర్శి నాయుడు, వైసిపి నేత బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు అధ్వర్యంలో పనులు జరిగాయి

నిత్యాన్నదానానికి సహకరించాలి

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని కెజె పురం జంక్షన్ వద్ద సంతోషి మాత ఆలయంలో జరిగే నిత్య అన్నదాన కార్యక్రమానికి భక్తులు సహకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ళ అమ్మ తల్లి నాయుడు కోరారు. వివాహాది కార్యక్రమాలు, పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేయాలనుకునే భక్తులు ముందుగా ఆలయ కమిటీ వద్ద వివరాలు నమోదు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్:9849697916 నంబరుకు సంప్రదించాలని కోరారు.

ముగిసిన దీక్షలు

ప్రజాశక్తి-మాడుగుల:ఈనెల 6న జరగనున్న మాడుగుల మోదకొండమ్మ పండగ సందర్భంగా భక్తులు చేపట్టిన మాలాధారణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. వైశాఖ మాసంలో మండలంలోని అనేక గ్రామాలకు చెందిన భక్తులు 29 రోజుల పాటు మాలలు ధరించారు. భక్తి, శ్రద్ధలతో మాలలు పూర్తి చేసి ఆదివారం సాయంత్రం శతకం పట్టు వద్ద ఇరుముడి ఏర్పాటు చేసి దీక్షను విరమించారు. ఈ కార్యక్రమంలో గురు మాతలు దరిమిసెట్టి పైడి నాయుడు, పల్ల సత్తిబాబు, గండి కొండబాబు పాల్గొన్నారు. ఈ దీక్షలు కొన్ని సంవత్సరాల క్రితం కీర్తిశేషులు గన్నం రాజు సుబ్బారావు మాస్టారు ప్రారంభించారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో లింగంపేట పంచాయతీ శివారు గొర్రెంపేటలో ఆదివారం రామాలయ వార్షికోత్సవం గ్రామస్తులంతా ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు సహకారంతో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మిడతన సూరిబాబు, అచ్చర్ల కన్నబాబు, శ్రీరంరెడ్డి అర్జున పాల్గొన్నారు.


వడ్డిస్తున్న నిర్వాహకులు

కోరమండల్ రైలు దుర్ఘటన దురదృష్టకరం...

- సహాయక చర్యల్లో సిబ్బంది యావన్మందీ భాగస్వామ్యం
- ఎక్కడికక్కడే కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- మృత దేహాల తరలింపునకు ప్రత్యేక వాహనాలు
- ప్రజాశక్తితో వాల్తేరు డిఆర్ఎం అనుప్‌కుమార్ సత్‌పతి





ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'బాలాసూర్ వద్ద కోరమండల్ రైలు దుర్ఘటన చోటుచేసుకోవడం అత్యంత దురదృష్టకరం. మానవ తప్పిదం అనేకంటే సాంకేతిక లోపం జరిగి ఉండొచ్చు. జరిగిన ఘటనపై జాతీయ స్థాయిలో విచారణకు కూడా కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీచేసింది. ఈ ప్రమాదం అనంతరం సహాయక చర్యల్లో దేశంలోని అన్ని రైల్వే డిపార్టుమెంట్‌లకు చెందిన ఉద్యోగులు, వాల్తేరు రైల్వే నుంచి సిబ్బంది, అధికారులు అప్రమత్తమై భాగస్వామ్యం అవుతూ సేవలు అందజేస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రమాద ఘటనపై నిరంతర మోనటరింగ్ చేస్తూ సీనియర్ మంత్రి, ఐఎఎస్, ఐపిఎస్‌లను ఒడిశా పంపి సహాయక చర్యల్లో భాగస్వామ్యం కొనసాగుతుంది' అని వాల్తేరు రైల్వే డిఆర్ఎం అనూప్‌కుమార్ సత్‌పతి ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

ఏపికి చెందిన ప్రయాణికులు ఎంతమంది ప్రమాదంలో చిక్కుకున్నారు?

178 మంది ఏపి వాళ్లున్నారు. బాలాసూర్ ఘటనలో విశాఖకు చెందిన 110 మంది ఉంటారని భావిస్తున్నాం. గాయాలైనవారిని ప్రత్యేక రైళ్లలో తెస్తున్నాం. ఎంతమంది క్షతగాత్రులైనారో పూర్తిస్థాయిలో తెలియడం లేదు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వివరాలను ఇప్పటికే వెబ్‌సైట్లలో పొందుపరిచాం. బాలాసూర్ రైలు ప్రమాదంలో మరణించిన వారి ఫొటోల గుర్తింపును సులభతరం చేసేలాగ ఒడిశా స్పెషల్ రిలీఫ్ కమిషనర్ ఆమోదంతో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. పరిస్థితి యదాతథ స్థితి వచ్చేందుకు మరో 24 గంటల సమయం పట్టే అవకాశాలున్నాయి.

సహాయక చర్యలు ఎలా ఉన్నాయి?

దేశంలో జరిగిన ఒకటి రెండు పెద్ద ప్రమాదాల్లో ఇదొకటి. భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశారు. మరణించిన వారి వివరాల కోసం 1929ని సంప్రదించాలని చెబుతున్నాం. మరణించిన వారిని గుర్తించడానికి వివిధ ఆసుపత్రుల్లో మార్చురీలకు తీసుకెళ్లడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఏదైనా సహాయం అవసరమైతే ఐఎఎస్ అధికారి తిరుమలనాయక్ 8895351188ను సంప్రదించాలని ప్రకటించాం.

బాధితుల కోసం ఇంకా ఏయే ఏర్పాట్లు చేస్తున్నారు?

బాధితులకు ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు అధికారులను ప్రభుత్వం నియమించింది. కటక్ రైల్వే స్టేషన్, బస్టాండ్, ఎస్బిబి మెడికల్ కాలేజీ, భువనేశ్వర్ రైల్వేస్టేషన్, బారముండా బస్ స్టాండ్ విమానాశ్రయంలలోని అన్ని ఎంట్రీ పాయింట్ల వద్ద హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు.

వేర్వేరుచోట్ల ఇద్దరు అదృశ్యం


నల్లబెల్లి దివ్య


ఎం.అరుణ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో లింగంపేట గ్రామానికి చెందిన నల్లబెల్లి దివ్య(25) అనే వివాహిత అదృశ్యమైనట్లు కేడిపేట ఎస్సై ఉపేంద్ర తెలిపారు. గత నెల 27న సాయంత్రం నుండి తన పాపతో సహా కనపించలేదని ఫిర్యాదు అందించిందన్నారు. ఎవరికైనా ఆచూకి తెలిస్తే తెలియజేయాలని సూచించారు.

మండలంలోని ఏఎల్‌పురం గ్రామానికి చెందిన మంజేటి అరుణ(23) ఈ నెల 2వ తేదీ తెల్లవారుజాము నుంచి కనిపించ లేదని తమకు ఫిర్యాదు అందిందని కేడిపేట ఎస్సై ఉపేంద్ర తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని, ఆచూకి తెలిసిన వారు 08932-280033, 94409042 40 నెంబర్లకు తెలియజేయాలని సూచించారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కొత్త మల్లంపేట ఎంపీయుపి పాఠశాలలో సర్పంచ్ పొలిరెడ్డి రాజబాబు ఆధ్వర్యంలో కాకినాడ అంజు ఐ-కేర్ ఫౌండేషన్, అంజు కంటి ఆసుపత్రి తేజ పర్యవేక్షణలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా రోగులకు వైద్యులు విమ్మి కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగానే కంటి ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. సుమారు 100మందికి పైగా కంటి పరీక్షలు చేసామన్నారు. గ్రామ సర్పంచ్ రాజబాబు మాట్లాడుతూ, కంటి సమస్యలతో బాదపడకూడదనే ఉద్దేశ్యంతోనే వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అప్పలనాయుడు, జిరెడ్డి ప్రకాష్, మేనేజర్ స్వామి వందన్, సిబ్బంది పాల్గొన్నారు.


నిరుపయోగంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్

షాపింగ్ కాంప్లెక్స్

అందుబాటులోకి వచ్చేదెన్నడో?

ఎమ్మెల్యే ప్రారంభించారు..

అధికారులు మరిచారు...

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో లింగాపురం జంక్షన్ వద్ద నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు ప్రారంభించి మూడు నెలలు కావస్తున్నా అందుబాటులోకి తీసుకు రావడంపై అధికారులు పట్టించుకోలేదు. సుమారు రెండు సంవత్సరాల క్రితం 17 లక్షలతో నిర్మించిన 15 దుకాణాల గల షాపింగ్ కాంప్లెక్స్ ఎమ్మెల్యే ప్రారంభించగానే అందుబాటులోకి వస్తుందని, దుకాణం దక్కించుకునేందుకు ఆశావహులు ఆశగా ఎదురు చూశారు. అధికారులు ఆ ఊసే మరిచారు. మండల పరిషత్ అధికారులు కాంప్లెక్స్ కి వేలంపాట నిర్వహించి వేలంలో దక్కించుకున్న వారికి షాపులు అందజేయాల్సి ఉంది. ప్రధాన కూడలి కావడంతో దుకాణం దక్కించుకునేందుకు చాలా మంది ఆశగా ఎదురుచూస్తున్నారు. దుకాణం దక్కించుకుంటే జీవనోపాధి దక్కుతుందని సమీప ప్రాంత వాసులు ఎదురు చూస్తున్నారు. దుకాణాలు నిర్మించి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నా నేటికీ అందుబాటులోకి తీసుకు రాకపోవడం అధికారుల నిర్లక్ష్యమేనని, దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుందని మండల వాసులు విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవచూపి వేలంపాట నిర్వహించాలని కోరారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్


పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గొలుగొండ: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కు తుందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. ఆదివారం నాలుగో రోజు గొలుగొండ మండలం ఏఎల్‌పురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ గడపకు వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అర్హత గల వారికి రాజకీయాలు, పార్టీలకు అతీతంగా పథకాలు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ సిహెచ్.భాస్కర్‌నాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, ఎంపిడిఒ డేవిడ్‌రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుదీష్న, వెలుగు ఏపిఎం మంగ, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, స్థానిక సర్పంచ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు లోచల సుజాత, స్థానిక ఎంపిటిసి బుల్లి ప్రసాద్, కృష్ణ, మండల యూత్ అధ్యక్షులు రామకృష్ణనాయుడు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పెదపూడి శివ, చోద్యం పిఎసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, ఏఎంసి చైర్మన్ కొల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఐడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ప్రారంభం

ఐసిడిఎస్ గొలుగొండ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అవసరమైన కేంద్రాలకు పక్కా భవనాలను నిర్మించేందుకు నిధులు విడుదల చేస్తామని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన గొలుగొండలో ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఇప్పటివరకు నర్సీపట్నం ప్రాజెక్టులో భాగమైన గొలుగొండ నాతవరం మండలాలను గొలుగొండ ప్రాజెక్టుగా రెండు నెలల క్రితం ఐసిడిఎస్ వారు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేకపోవడంతో అద్దె భవనాన్ని కార్యాలయంలో ఏర్పాటు చేసి ముస్తాబు చేశారు. ఈ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గొలుగొండ, నాతవరం మండలాల్లో 10 కేంద్రాలకు, అలాగే మండల కేంద్రాలయంలో ప్రాజెక్ట్ కార్యాలయానికి పక్కా భవనాలు అవసరమై ఉందని వాటికి నిధులు మంజూరయ్యే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే మండలంలో పుత్తడిగైరంపేట, పేటమలపల్లి అంగన్వాడీ కేంద్రాల నిర్మాణాలను పూర్తి చేయడానికి జడ్పిటిసి నిధులను ఇప్పటికే కేటాయించామన్నారు.



సరఫరా చేస్తున్న మంచినీరు

తాగునీరు సరఫరా

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగుల వాసుల కోరిక మేరకు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ నాలుగు రోజుల పాటు గ్రామంలో ట్యాంకుల ద్వారా మంచినీటి సరఫరాకు అంగీకారం తెలిపారు. దీంతో ఈ మేరకు ఆదివారం మధ్యాహ్నం నుండి విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో మంచినీటి సరఫరా ప్రారంభించారు. ఈ మేరకు మాడుగుల పాల కేంద్రం కార్యదర్శి గండి జోగినాయుడు ఈ వివరాలు అందించారు. మంచినీటి సరఫరా పట్ల ఆలయ కమిటీకి, విశాఖ డెయిరీ కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

'అన్నదాత పథకంతో రైతుల జీవితాల్లో వెలుగులు'

ప్రజాశక్తి - కశింకోట

రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగ చేయడమే టీడీపీ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మండలంలోని తాళ్ళపాలెంలో టిడిపి ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి ఆదివారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దుక్కు దున్ని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడి పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలనే ఏరువాక పౌర్ణమి కార్యాక్రమం చేస్తున్నామన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే అన్నదాత పథకం ద్వారా ఏడాదికి రూ.20వేలు రైతులకు ఇస్తామన్నారు. వైసిపి ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాయలు మురళి, ఉగ్గిన రమణ మూర్తి, మజ్జి నిరంజన్ కుమార్, గొంతుని శ్రీనివాసరావు, ఎంపీటీసీ బుద్ధిరెడ్డి అప్పడు, నైనంశెట్టి రమణారావు, మనసాల నానాజీ, ఆనాల తాతిల నాయుడు, జెర్రిపోతల నూకి నాయుడు, కర్రి దుర్గి నాయుడు, తీర్రి చిరంజీవి, కోన రమణ, ఉల్లింగల రమేష్, గొకివాడ వెంకట అప్పారావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: రాష్ట్రాన్ని అప్పులతో అంధకారంలో ముంచి వ్యవసాయాన్ని, రైతాంగాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అథోగతి పాలు చేశారని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు అమలకంటి అబద్ధం విమర్శించారు. ఎరువాక పౌర్ణమి సందర్భంగా రైతులకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన రైతులతో కలిసి పొలంలో నాగలి పట్టారు. అనంతరం మాట్లాడుతూ, తెలుగుదేశంతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం చెల్లించకుండా రైతులను దగా చేశారని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలన్నా, వ్యవసాయానికి, రైతులకు మంచి రోజులు రావాలన్నా మళ్ళీ తెదేపా అధికారంలోకి రావాలని ఆవశ్యకత ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


ఎస్.రాయవరంలో ఏరువాక చేపడుతున్న నాయకులు